క్లుప్తంగా

రూ.1.20 కోట్లతో ఫెసిలిటీ సెంటర్ల నిర్మాణం



పాతపట్నం ఏఎంసీ ఆవరణలో మల్టీ పర్పజ్ ఫెసిలిటీ సెంటర్

పాతపట్నం: పాతపట్నం, కొసమాల, గొప్పిలి పీఏసీఎస్ పరిధిలోని మూడు చోట్ల మల్టీ పర్పజ్ ఫెసిలిటీ సెంటర్లను మార్కెట్ శాఖ ఆధ్వర్యంలో రూ.1.20 కోట్లతో ఏర్పాటు చేశారు. పాతపట్నం మార్కెట్ కమిటీ ఆవరణలో రూ.40లక్షలతో మల్టీ పర్పజ్ ఫెసిలిటీ సెంటర్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. మెళియాపుట్టి మార్కెట్ కమిటీ ఆవరణలో రూ.40 లక్షలు, గొప్పిలిలో రూ.40 లక్షల వ్యయంతో మల్టీ పర్పజ్ ఫెసిలిటీ సెంటర్ల పనులు చేపడుతున్నారు. ఈ భవనాలు పూర్తయితే ఒక్కో భవనంలో 500 మెట్రిక్ టన్నుల పంటను రైతులు స్టోరేజ్ చేసుకోవచ్చునని మార్కెట్ శాఖ డీఈఈ కోటయ్య తెలిపారు.

రైతులను మోసగిస్తే లైసెన్స్ రద్దు



పెంద్రువాడలో ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న ఏఓ సంధ్య

హిరమండలం: రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు నాణ్యమైనవిగా ఉండాలని, నకిలీవి అంటగట్టి రైతులకు మోసం చేస్తే లైసెన్స్ రద్దుచేస్తామని ఫర్టిలైజర్స్ దుకాణ యజమానులకు మండల వ్యవసాయశాఖాధికారి బి.సంధ్య హెచ్చరించారు. మండలంలోని పలు షాపులను గురువారం తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువులు క్రిమిసంహారక మందులు కొనుగోలు చేసినప్పుడు చిత్తు కాగితాల్లో రాసి ఇవ్వకుండా ఒరిజినల్ బిల్లులు ఇవ్వాలన్నారు. విత్తనాలకు స్టోర్స్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని, స్టాక్ రిజిస్టర్ ప్రతిరోజు అప్‌డేట్ చేయాలని, ధరలు పట్టిక తప్పనిసరిగా షాపు వద్ద ప్రదర్శించాలన్నారు.

ప్రత్యేకావసరాల చిన్నారుల గుర్తింపు



పాతపట్నంలోని రాజీవ్‌నగర్‌లో చిన్నారులను గుర్తిస్తున్న ఎంఈఓ శ్రీధర్

పాతపట్నం: ప్రభుత్వం సమగ్ర శిక్షాభియాన్ ద్వారా ప్రత్యేక అవసరాల చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని పాతపట్నం ఎంఈఓ బొయిన శ్రీధర్ అన్నారు. మండలంలోని పాతపట్నం, అచ్యుతాపురం, అంతరాబ గ్రామాల్లో ప్రత్యేక అవసరాల విద్యను అందించాల్సిన బాలబాలికల గుర్తింపు సర్వేను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 21 మంది పిల్లలను గుర్తించామన్నారు. ప్రస్తుతం ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఉన్న భవిత సెంటర్‌లో ప్రత్యేక అవసరాల చిన్నారులను చేరుతున్నామన్నారు. మండల ప్రత్యేక అవసరాల విద్య ఉపాధ్యాయులు సుధారాణి, ఇన్నా, బాబూరావు, కళావతి, సీఆర్పీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



అంగన్‌వాడీ కార్యకర్తల నుంచి ధ్రువపత్రాలు తీసుకుంటున్న ఎంఈఓ

సారవకోట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ ఎంఈఓ భూలక్ష్మి గురువారం పలు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రీ స్కూల్ పూర్తి చేసిన విద్యార్థుల వివరాలు, వారి నుంచి ధ్రువపత్రాలను తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు మౌలిక వసతులు, మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు అందిస్తున్నామన్నారు. సీఆర్పీ షణ్ముఖరావు, సిబ్బంది కుమారి, కుమార్ పాల్గొన్నారు.

పొంచివున్న ముప్పు



పొందూరు మండలంలోని బొడ్డేపల్లి రైల్వే అండర్ పాసేజ్ ప్రవేశమార్గంలో ఇనుప చువ్వలు పైకి లేచి ప్రమాదకరంగా మారాయి. తాడివలస, లొద్దలపేట, బెలమాం గ్రామాల మీదుగా శ్రీకాకుళం వెళ్లే ప్రయాణికులకు ప్రమాదం పొంచి ఉంది. పొందూరు, ఆమదాలవలస, సంతకవిటి మండలాల్లోని పలు గ్రామాల ప్రజలు నిరంతరం వందల సంఖ్యలో శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి రాకపోకలు సాగిస్తున్నారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా పైకి లేచిన ఈ ఇనుప చువ్వలతో ప్రాణాలకు ముప్పు తప్పదని ఆందోళన చెందుతున్నారు. రైల్వే అధికారులు తక్షణమే స్పందించి వాటిని తొలగించాలని లేదా కాంక్రీట్ వేసి కప్పి వేయాలని వాహనదారులు కోరుతున్నారు.

- పొందూరు

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



పచ్చిరొట్ట విత్తనాలు వల్ల పంటలకు క్రిములు, కీటకాలు బెడదలేకుండా దిగుబడులు పెరుగుతాయని వెలుగు కమ్యూనిటీ కో ఆర్డినేటర్ కూన రోజాలత తెలిపారు. సరుబుజ్జిలి మండలంలోని ప్రకృతి వ్యవసాయ గ్రామం రావివలసలో ప్రకృతి వ్యవసాయ టీమ్ ఆధ్వర్యంలో అందించిన పచ్చిరొట్ట విత్తనాలు గురువారం రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. వ్యవసాయ పనిముట్లు, చోడి విత్తనాలు కూడా రైతులు కోరిన తక్షణమే అందిస్తామని వెల్లడించారు. ఏపీసీఎన్‌ఎఫ్ తిరుపతిరావు, టి.సుమ, వీఓఏ మంగమ్మ, సీసీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

- సరుబుజ్జిలి

నేత్ర చికిత్సలకు 45 మంది ఎంపిక



నరసన్నపేటలోని సత్యసాయి మందిరంలో భగవాన్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి శస్త్ర చికిత్స శిబిరం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ సహకారంతో కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 110 మంది కంటి రోగులకు తనిఖీలు చేపట్టగా 45 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కంటి నరాల చికిత్స కోసం నలుగురు, కంటిపై పొర చికిత్స కోసం ముగ్గురు, కంటి నీటి కాసుల చికిత్స కోసం ఇద్దరిని ఎంపిక చేశామని శంకర్ ఫౌండేషన్ ప్రతినిధి అప్పలరాజు తెలిపారు. కంటి వైద్య నిపుణులు శ్రీవిన్య, పోలాకి ఆప్తాలమిక్ అసిస్టెంట్ బాలగంగాధరరాజు సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు మూర్తి, నాగేశ్వరరావు, కె.ఎల్.ఎన్.రాజు తదితరులు పాల్గొన్నారు.

- నరసన్నపేట

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు

కొత్తూరు: గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల వల్ల విద్యార్థులకు ఎంతో ప్రయోజనం ఉంటుందని జిల్లా గ్రంథాలయా సంస్థ కార్యదర్శి బి.కుమార్ రాజా అన్నారు. కొత్తూరు శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను గురువారం పరిశీలించారు. మే 15 నుంచి నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో విద్యార్థులు నేర్చుకున్న అంశాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పుస్తకాలు చదివించడం, రాయించడంతోపాటు చిత్రలేఖనం, ఆటల పోటీలు నిర్వహించడంతోపాటు పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో గెలపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయం అధికారి ఇందిర పాల్గొన్నారు.



పాతపట్నం: పుస్తకం చదువుతున్న విద్యార్థిని కల్యాణి

విద్యార్థులకు బహుమతుల పంపిణీ

సారవకోట: మండల కేంద్రంలోని మహాత్మాగాంధీ స్మారక శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. వేసవి శిక్షణ శిబిరం ముగియడంతో ఈ శిక్షణ కార్యక్రమంలో నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసినట్లు లైబ్రేరియన్ సాయమ్మ తెలిపారు. సిబ్బంది దుర్గారావు, పాఠకుడు ఢిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి..

పాతపట్నం: ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీవీ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ ఎం.బాబూరావు అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో గురువారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు కథలు చదవడంపై పోటీలు నిర్వహించారు. ప్రతి విద్యార్థి పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా గ్రంథాలయాలకు వచ్చి జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించిన పుస్తకాలు, కాంపిటేషన్‌కు సంబంధించిన పుస్తకాలు, వివిధ రకాల పుస్తకాలను పూర్తి స్థాయిలో చదవాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడించారు. గ్రంథాలయాధికారి కళ్ల రాజు, రిసోర్స్‌పర్సన్ పెద్దింటి ఆనందరావు, టి.బెనర్జీ, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.





కొత్తూరు: వేసవి శిక్షణను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్ రాజా   సారవకోట: బహుమతులతో విద్యార్థులు, లైబ్రేరియన్

విత్తనాల కోసం పేర్ల నమోదు

ఎల్.ఎన్.పేట: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి సాగుకు అవసరమయ్యే విత్తనాలు కావలసిన రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ పైడి లతశ్రీ గురువారం తెలిపారు. అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద శుక్రవారం నుంచి రైతుల పేర్లు నమోదు చేయటం జరుగుతుందన్నారు. విత్తనాలు కావలసిన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకాలు, ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ తీసుకుని వెళ్లి వారి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ఖరీఫ్ వరిసాగుకు రైతుల కోసం స్వర్ణ, 1061, 1064, సీఆర్, సాంబ మసూరి, సోనా మసూరి, ఎంటీయూ 1224, ఎంపీటీయూ 1318 రకాల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆర్బీకేల్లో వ్యవసాయ సహాయకుల వద్ద పేర్లు నమోదు చేసుకున్న రైతులకు ఆర్బీకేల ద్వారా విత్తనాలు సరఫరా చేయటం జరుగుతుందన్నారు.

కొత్తూరు మండలంలో..

కొత్తూరు: రాయితీపై అందిస్తున్న వరి విత్తనాలు కావల్సిన రైతులు తమ పేర్లను రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఆధార్ కార్డుకు భూములు లింక్ అయిన రైతులకు మాత్రమే విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మండలానికి 1507 క్వింటాళ్ల వరి విత్తనాలు మంజూరైనట్లు చెప్పారు. గిరిజనుల కోసం 90 ధాయితీపై 420 క్వింటాళ్లు మంజూరయ్యాయన్నారు. ఇతర రైతులకు కిలో పది రూపాయిల రాయితీపై విత్తనాలను విక్రయించడం జరగుతుందన్నారు. మండలానికి 9 రకాల వరి విత్తనాలు కేటాయించినట్లు చెప్పారు. ఎకరాకి ఒక బస్తా చొప్పున అందజేస్తామన్నారు. ఒక రైతుకు గరిష్టంగా నాలుగు బస్తాలు మాత్రమే ఇవ్వడం జరుగుతుందన్నారు.

మెళియాపుట్టి మండలంలో..

మెళియాపుట్టి: మండలంలోని రైతులందరూ విత్తనాల కోసం ఆర్‌బీకేల్లోని గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ధానకర్నుడు గురువారం తెలిపారు. మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో మాట్లాడుతూ రైతులందరికీ రాయితీపై విత్తనాలు అందజేస్తామన్నారు. రైతులకు కావాల్సిన విత్తనాల కోసం పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై విత్తనాలు అందిస్తామన్నారు.



కొత్తూరు: కురిగాం ఆర్‌బీకేలో పేర్లు నమోదు చేస్తున్న వ్యవసాయ సహాయకులు

హిరమండలం మండలంలో..

హిరమండలం: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి విత్తనాల కోసం రైతులు రైతు భరోసా కేంద్రాల్లో ఏయే విత్తనాలు అవసరమో పేర్లు నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖాధికారి బమ్మిడి సంధ్య గురువారం తెలిపారు. ఎంటీయూ 1224 (మారిటేరు సాంబ), బీపీటీ 5204 (సాంబ మసూరి), ఆర్‌జీఎల్ 2537 (శ్రీకాకుళం సన్నాలు), ఎంటీయూ 7029 (స్వర్ణ), ఎంటీయూ 1061 (ఇంద్ర), ఎంటీయూ 1064,(అమర), ఎంటీయూ 112(శ్రీధృతి), బీపీటీ 3291 (సోనా మసూరి), ఎంటీయూ 1318 రకాల విత్తనాలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే సబ్సిడీపై విత్తనాలు అందజేస్తామన్నారు.

ప్రజల నమ్మకాన్ని నిలబెడతా..

నరసన్నపేట: ఈ గెలుపు ప్రజలది. మీరందరూ నాపై ఉన్న నమ్మకంతో గెలిపించారు. మీ నమ్మకాన్ని వమ్ము చేయను అని సార్వత్రిక ఎన్నికల్లో నరసన్నపేట నుంచి విజయం సాధించిన టీడీపీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. గురువారం సాయంత్రం నరసన్నపేటలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పైడితల్లి ఆలయం నుంచి ఇందిరానగర్‌లోని పార్టీ కార్యాలయం వరకు విజయోత్సవ ర్యాలీ కొనసాగింది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి టీడీపీ, జనసేన కార్యకర్తలు దీంట్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమణమూర్తి మాట్లాడుతూ నరసన్నపేట అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ప్రయత్నిస్తానన్నారు. ఎన్నికల సందర్భంగా పనిచేసిన కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు శిమ్మ చంద్రశేఖర్, గొద్దు చిట్టిబాబు, సాసుపల్లి కృష్ణబాబు, పీస కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కార్యకర్తలకు అభివాదం చేస్తున్న బగ్గు రమణమూర్తి

నీట్ ఫలితాల్లో సుభాష్య ప్రతిభ



సుభాష్యకు స్వీట్ తినిపిస్తున్న తల్లిదండ్రులు

శ్రీకాకుళం న్యూకాలనీ: నీట్-2024 ఫలితాల్లో జిల్లాకు చెందిన తండ్రాపు సుభాష్య ప్రతిభ కనబర్చింది. తాజాగా వెలువడిన ఫలితాల్లో సుభాష్య720 మార్కులకుగాను 690 మార్కులు సాధించి శభాష్ అనిపించింది. ఆలిండియాస్థాయిలో 4265వ ర్యాంకు, ఓబీసీ కేటగిరిలో 1624వ ర్యాంకు సాధించి సీటు ఖాయం చేసుకుంది. తండ్రి తండ్రాపు శ్రీనివాసరావు జెడ్పీహెచ్ స్కూల్ అంపోలులో ఫిజికల్ డైరెక్టర్ (ఎస్ఏ పీఈ)గా పనిచేస్తుండగా, తల్లి పద్మావతి గృహిణి. ప్రస్తుతం శ్రీకాకుళం సమీపంలోని నవభారత్‌నగర్ వద్ద నివాసం ఉంటుండగా.. వీరిస్వస్థలం జిల్లాలోని నరసన్నపేట మండలం సత్యవరం. తమ కుమార్తెకు మెడికల్ సీటు రానుండటంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

ముమ్మరంగా మెట్టు దుక్కులు

జి.సిగడాం: రైతన్నలు పంట పొలాలు సాగుచేసేందుకు సన్నద్ధం అవుతున్నారు. మెట్టు భూములు తయారుచేసేందుకు రైతన్నలు నిమగ్నమయ్యారు. మండల పరిధిలో దేవరవలస, వెలగాడ, చెట్టుపొదిలాం పెంట, నాగులవలస, మద్రివలస, సీతంపేట, ఎందువ, బాతువ, జాడ, జగన్నాథవలస, జి.సిగడాం గ్రామాలతోపాటు పలు గ్రామాల రైతులు మెట్టు ప్రాంతాల్లో పండించేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు.

గణితంలో మెలకువలు తెలుసుకోవాలి



లెమన్ స్పూన్ ఆడుతున్న విద్యార్థులు

మెళియాపుట్టి: విద్యార్థులకు గణితం ఎంతగానో ఉపయోగపడుతుందని, మెలకువలు తెలుసుకోవాలని ఎంఈఓ-2 పద్మనాభరావు అన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయాన్ని సందర్శించి విద్యార్థులకు గణితంలో పలు సూచనలను అందించారు. గ్రంథాలయాలను వినియోగించుకుని చదువులో ప్రతిభ చూపాలని పిలుపునిచ్చారు. అనంతరం లెమన్ స్పూన్ ఆటను ఆడించారు. గ్రంథాలయ అధికారి అనురాధ మాట్లాడుతూ విద్యార్థులకు ఉపయోగపడేలా అనేక రకాలైన పుస్తకాలు అందుబాటులో ఉంచామని, వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలను అందజేస్తున్న ఎంఈఓ-2 పద్మనాభరావు

10న ఆడిట్

హిరమండలం: ఈ నెల 10వ తేదీన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి మండలంలోని 9 పాఠశాలలకు మంజూరైన అభివృద్ధి నిధుల (సివిల్ వర్కు) ఖర్చులపై ఆడిట్ నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి కె.రాంబాబు తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో సీఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ మండలంలోని గొట్ట, కొండరాగోలు, పింద్రువాడ, ధనుపురం, సుభలయ, సవరచొర్లంగి, పెద్దకోరాడ ప్రాథమిక పాఠశాలలతోపాటు జీపీఎస్ పాఠశాలలైన ఎగువరుగడ, నేరడిగూడ పాఠశాలలకు ఆడిట్ నిర్వహిస్తామన్నారు. వీరితోపాటు ఎల్ఎన్‌పేట, సరుబుజ్జిలి, కొత్తూరు, పాతపట్నం మండలాలకు చెందిన పలు పాఠశాలలకు కూడా ఆడిట్ జరుగుతందన్నారు. ఆడిట్‌కు సంబంధించిన వివరాలన్నింటినీ హెచ్ఎంలు సిద్ధ చేసుకుని హాజరుకావాలన్నారు. పాఠశాలల్లో నూతన అడ్మిషన్లు, విద్యా కానుకపై సమీక్షించారు. సీఆర్పీలు ధనుంజయరావు, శ్రీదేవి, గోవిందరావు, సీతంనాయుడు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ రాంబాబు

రెడ్‌క్రాస్ సేవా స్ఫూర్తి



ఏడురోడ్ల కూడలి వద్ద అన్నదానం

శ్రీకాకుళం కల్చరల్: ఇండియన్ రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు ఆధ్వర్యంలో గురువారం నగరంలో పలు సేవా కార్యక్రమంలో నిర్వహించారు. రక్తనిధి కేంద్రంలో ఇద్దరు రెడ్‌క్రాస్ వలంటీర్లు తమ జన్మదినం సందర్భంగా స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు మూడు యూనిట్ల రక్తం ఉచితంగా అందించారు. నిరుపేదకు ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌ను అందజేశారు. అదే విధంగా, ఏడురోడ్ల కూడలి, డే అండ్ నైట్ కూడలిలో 350 మందికి అన్నదానం చేశారు.

నవధాన్యాల సాగుతో లాభాలు

హిరమండలం: ప్రకృతి సేద్యం, నవధాన్యాల సాగుపై అవగాహన కలిగి ఉండాలని వెలుగు ఏపీసీఎన్‌ఎఫ్ అదనపు డీపీఎం ధనుంజయరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయ సమావేశ మందిరంలో ఏపీఓ వి.శ్రీరామచంద్రమూర్తి ఆధ్వర్యంలో ఎంఎంఎస్‌సభ్యులు, సీసీలు, వీఓఏలతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యా వికాస్ కేంద్రాలు ఏడు ఉన్నాయని, అందులో సభ్యులకు 30 రకాల పీఎండీఎస్ కిట్లు తయారీపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంటీ సూర్యనారాయణ, సీసీలు అసిరయ్య, అప్పన్న, శ్రీదేవి, జయంతి, సుజాత, అకౌంటెంట్ బేబీ తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న ఏపీఎం శ్రీరామచంద్రమూర్తి

మలేరియాపై అవగాహన

జలుమూరు: మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ పారా మెడికల్ అధికారి వాన సురేష్ కుమార్ అన్నారు. రావిపాడు సచివాలయం పరిధిలో అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను గురువారం పరిశీలించి అడిగి తెలుసుకున్నారు. డెంగీ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇటీవల నిర్వహించిన ఎల్బీడీసీ సర్వే నివేదికలు పరిశీలించి అనుమానిత కేసులపై స్క్రీనింగ్ చేయాలన్నారు. సీహెచ్ఓ జగదీశ్వరి, ఏఎన్ఎం వి.గౌరీ, ఆరోగ్య కార్యకర్త టి.వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను తనిఖీ నిర్వహిస్తున్న సురేష్ కుమార్

ఉపాధి పనుల పరిశీలన

కొత్తూరు: ప్రభుత్వం నిర్ణయించిన రూ.300 గరిష్ట వేతనం పొందేలా పనులు చేయాలని వేతనదారులకు ఎంపీడీఓ త్రివిక్రమరావు సూచించారు. మండలంలోని జోగిపాడు, నేరడి గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ గురువారం పరిశీలించారు. వేతనదారుల మస్తర్లను పరిశీలించారు. పనులకు రానటువంటి వేతనదారులకు హాజరవ్వాలన్నారు. నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేసినప్పుడే గరిష్ట వేతనం వస్తుందన్నారు. పనులు నాణ్యతగా చేపట్టాలన్నారు. పనుల్లో సమయం పాలన పాటించాలన్నారు. ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



మస్తర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రివిక్రమరావు